ఐదు రోజులే అసెంబ్లీ సమావేశాలు



అసెంబ్లీ బయట మోహరించిన పోలీసులు

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలు ఐదు రోజులపాటు జరుగుతాయని స్పీకర్ అప్పావు ప్రకటించారు. సోమవారం ఉదయం శాసన సభలో గవర్నర్ ఆంగ్ల ప్రసంగం తమిళ అనువాదాన్ని స్పీకర్ చదివిన తర్వాత సభ మంగళవారానికి వాయిదా పడింది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం శాసనసభా వ్యవహార మండలి సభ్యులు స్పీకర్ ఛాంబర్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం స్పీకర్ అప్పావు మీడియాతో మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలు ఈ నెల 11 వరకు జరుగుతాయని తెలిపారు. మంగళవారం ఉదయం సభలో ముందుగా మాజీ శాసనసభ్యుల మృతిపై సంతాప ప్రకటన చేస్తామన్నారు. తర్వాత భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, సిట్టింగ్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతికి సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టిన తర్వాత సభ వాయిదా పడుతుందన్నారు.

సభా సంప్రదాయాలు పాటించాలి

● టీవీకే అధ్యక్షుడు విజయ్

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ సంప్రదాయాలు పాటించాలని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, నటుడు విజయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసనసభ సమావేశాలు సోమవారం గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రసంగంతో ప్రారంభం కావాల్సి ఉన్న నేపథ్యంలో, ఆయన ప్రసంగం చదువకుండానే సమావేశాల నుంచి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. తమిళ్‌తాయ్ వాళ్తు వెంటనే జాతీయ గీతం ఆలపించాలని గవర్నర్ సూచనలను, ముఖ్యమంత్రి, స్పీకర్ నిరాకరించడంతో గవర్నర్ వెళ్లినట్లు రాజ్‌భవన్ ప్రకటన విడుదల చేసింది. ఈ విషయమై టీవీకే అధ్యక్షుడు విజయ్ తన ఎక్స్ పేజీలో... తమిళ్‌తాయ్ వాళ్తు మొదటిగా, జాతీయ గీతం చివరగా ఆలపించడం రాష్ట్ర శాసనసభ సమావేశాల సంప్రదాయం. స్వర్ణోత్సవం జరుపుకున్న రాష్ట్ర శాసనసభ సంప్రదాయాలను ఎప్పటికీ కాపాడాలి. కేంద్ర ప్రభుత్వంచే నియమితులైన గవర్నర్ ఎవరైనా, రాష్ట్ర శాసనసభ సంప్రదాయం ప్రకారం నడుచుకోవాల్సి ఉందని విజయ్ తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మళ్లీ శాసనసభలో రచ్చ

● ఆదిలోనే జాతీయగీతం కోసం గవర్నర్ పట్టు
● ప్రసంగపాఠం జోలికి వెళ్ళకుండానే నిష్క్రమణ
● మూడు నిమిషాల్లోపే ముగిసిన పర్యటన
● అడిగినా జాతీయగీతం ఆలపించరా?
● నా అసెంబ్లీ దృశ్యాలను ఎడిట్ చేసి రిలీజ్ చేస్తారా?
● ప్రభుత్వ తీరు ఎమర్జెన్సీని తలపిస్తోంది ● ఆర్ఎన్.రవి ఆగ్రహం

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీలో మళ్లీ రచ్చ రేగింది. శాసనసభలో 'తమిళతాయ్' ప్రార్థన తర్వాత జాతీయ గీతాన్ని వినిపించకుండా అవమానించారని ఆరోపించిన గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదకుండానే నిష్క్రమించారు. ప్రతియేటా శాసనసభ తొలి సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యే విషయం తెలిసిందే. ఆ మేరకు గవర్నర్ రవి తొలిరోజు శాసనసభ సమావేశానికి సోమవారం ఉదయం సచివాలయానికి వచ్చారు. అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద గవర్నర్ పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. అనంతరం స్పీకర్ అప్పావు పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించి గవర్నర్‌ను సభలోకి తీసుకెళ్ళారు. ఉదయం 9.30 గంటలకు శాసనసభ సమావేశం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు పాలకపక్ష, ప్రతిపక్ష సభ్యులున్నారు. తమిళతాయ్ ప్రార్థన ముగియగానే గవర్నర్ కొన్ని సెకన్లపాటు నిలబడే వున్నారు. అనంతరం ముఖ్యమంత్రి, స్పీకర్ వైపు చూస్తూ జాతీయ గీతాన్ని వినిపించాలని కోరారు. గవర్నర్ సూచన పట్టించుకోకుండా ముఖ్యమంత్రి, మంత్రులు, స్పీకర్ సహా సభ్యులంతా కూర్చున్నారు.. దీంతో అలకవహించిన గవర్నర్ రవి స్పీకర్ పోడియం నుంచి దిగి సభ నుంచి వెళ్లిపోయారు. స్పీకర్ అప్పావు పరిస్థితి చక్కద్దిద్దేందుకు ప్రయత్నించారు. గవర్నర్ ప్రసంగ తమిళ అనువాదాన్ని చదివి వినిపించి, సభను మంగళవారానికి వాయిదా వేశారు.



అసెంబ్లీలోకి వెళ్లే ముందు పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న గవర్నర్ ఆర్ఎన్.రవి

జాతీయగీతానికి అవమానం..అందుకే వాకౌట్: గవర్నర్

శాసనసభలో జాతీయగీతాన్ని వినిపించకుండా రాజ్యాంగ ధర్మాసనాన్నే అవమానించారని, అందుకే తాను సభ నుంచి వాకౌట్ చేశానని గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రకటించారు. ఈ మేరకు రాజ్‌భవన్ ప్రకటన విడుదల చేసింది. సభలో తమిళ్ తాయ్ ప్రార్థన ముగియగానే జాతీయ గీతాన్ని ఆలపించాలని ముఖ్యమంత్రి, స్పీకర్‌పై ఒత్తిడి చేసినా ఫలితం లేకపోయిందని, గవర్నర్ కోరికను రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. శాసనసభలో జాతీయగీతాన్ని పాడకుండా మళ్లీ అవమానించారని, జాతీయగీతాన్ని గౌరవించటమే రాజ్యాంగంలో పేర్కొన్న మొదటి బాధ్యత అని, ఆ గీతాన్ని పాడకపోవడం శోచనీయమని తెలిపారు. ఈ కారణాల వల్లే గవర్నర్ ఆవేదనతో సభ నుండి నిష్క్రమించారని వివరించారు. ఇదిలా ఉండగా శాసనసభ ఉదంతంపై గవర్నర్ తొలుత ఓ సందేశాన్ని విడుదలచేసి, కాసేపటికి తొలగించి తాజాగా మరో సందేశాన్ని పొందుపరిచారు. తొలి సందేశంలో పార్లమెంట్ సమావేశాల ప్రారంభంలోనూ ముగింపులోనూ జాతీయ గీతాన్ని ఆలపిస్తున్నారని, అదే విధంగా రాష్ట్రపతి ప్రసంగానికి ముందు, తర్వాత జాతీయగీతాన్ని ఆలాపిస్తున్నారని రెండు వాక్యాలున్నాయి. అయితే కొద్దిసేపటికే ఆ రెండు వాక్యాలను తొలగించారు.

అడిగినా పట్టించుకోలేదు..

శాసనసభలో తమిళ్‌తాయ్ ప్రార్థన గీతం ఆలపించిన తర్వాత జాతీయగీతాన్ని వినిపించాలని, లేదా వాద్య సంగీతాన్నయినా వినిపించాలని తాను స్వయంగా ముఖ్యమంత్రిని, స్పీకర్‌ను కోరినా పట్టించుకోలేదని గవర్నర్ రవి ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం ప్రారంభం, ముగింపు సందర్భాలలో జాతీయ గీతం ఆలపించకపోవడం రాజ్యాంగ ధర్మాసనాన్ని, జాతీయగీతాన్ని అవమానించే చర్య అని, కనుకనే తాను ఆవేదనతో సభ నుండి నిష్క్రమించాల్సి వచ్చిందని సోమవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో గవర్నర్ పేర్కొన్నారు. అదే సమయంలో తమిళతాయ్ ప్రార్థనా గీతాన్ని తాను ఎప్పుడూ గౌరవిస్తూనే ఉన్నానని, ఆ గీతాన్ని కూడా పాడగలనని, తమిళ సంస్కృతిని, కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తంగా విస్తరింపజేయడానికి తనవంతు కృషిని అందిస్తూనే ఉన్నానని గవర్నర్ తెలిపారు.

ఎమర్జెన్సీని తలపిస్తోంది...

సోమవారం అసెంబ్లీ సమావేశంలో తాను పాల్గొన్న దృశ్యాలను పూర్తిగా విడుదల చేయకుండా సెన్సార్‌చేసి, ఎడిట్ చేసి మరీ విడుదల చేశారని, ఈ సంఘటన ఎమర్జన్సీ రోజులను తలపిస్తోందని గవర్నర్ ఆరోపించారు. సభా వ్యవహారాలను ప్రజలకు పారదర్శకంగా అందించటంలోనూ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.



అసెంబ్లీ నుంచి అసంతృప్తితో వెళ్లిపోతున్న రవి

రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 6.36 కోట్లు

● పురుషులు 3,11,74,027 ● మహిళలు 3,24,29,803 ● ట్రాన్స్‌జెండర్లు 9,120

అడయార్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025 సంవత్సరానికిగాను తుది ఓటర్ల జాబితా ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి అర్చనా పట్నాయక్ ప్రకటించారు. సోమవారం సచివాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 6,36,12,950 మంది ఉన్నారు. వీరిలో మహిళా ఓటర్లే అధికం. ఈ ఓటర్ల జాబితాను విడుదల చేసిన తర్వాత అర్చనా పట్నాయక్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనవరి 1 అర్హత తేదీగా తీసుకుని తుది ఓటర్ల జాబితా రూపొందించామన్నారు. ఈ సమగ్ర ఓటర్ల జాబితాను విడుదల చేయగా, ఇందులో గత యేడాది అక్టోబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు కోసం 14,02,132 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిలో 13,80,163 దరఖాస్తులను ఆమోదించామని, అలాగే, 497801 మంది పేర్లను జాబితా నుంచి తొలగించాలని దరఖాస్తులు వచ్చాయన్నారు. 1,09,131 మంది మరణించగా, 15797 డబుల్ ఎంట్రీలను జాబితా నుంచి తొలగించినట్టు పేర్కొన్నారు. ఈ మార్పులు చేర్పుల అనంతరం చివరకు 6,36,12,950 మంది ఓటర్లు ఉన్నట్లు తేలిందన్నారు. వీరిలో పురుషులు 3,11,74,027 మంది కాగా, మహిళలు 3,24,29,803 ఉన్నారని వివరించారు. ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 9,120 మంది ఉన్నారని తెలిపారు. ఈ తుది జాబితా ప్రకారం చెంగల్పట్టు జిల్లా షోళింగనల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 6,90,958 మంది ఓటర్లు ఉన్నారు. తర్వాత స్థానంలో కోయంబత్తూరు జిల్లా గౌండంపాళయంలో 4,91,143 మంది ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యల్ప ఓటర్లతో నాగపట్టణం జిల్లా కీళ్‌వేలూరు నియోజకవర్గం నిలిచిందని, ఇక్కడ మొత్తం 1,76,505 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. ఆ తర్వాతి స్థానంలో చెన్నై జిల్లా హార్బరు సెగ్మెంట్‌లో 1,78,980 మంది ఓటర్లు ఉన్నట్టు వివరించారు. ఈ తుది జాబితాలో 3,740 మంది ప్రవాస భారతీయులు ఓటర్లుగా ఉన్నారని పేర్కొన్నారు. దివ్యాంగ ఓటర్లు 4,78,007 మంది ఉండగా, 18 నుంచి 19 యేళ్లున్న 4,10,069 మందిని ఓటర్ల జాబితాలో చేర్చినట్టు వెల్లడించారు. ఓటర్ల జాబితాలో తమ పేర్ల పరిశీలనకు "http://elections.tn.go.in' అనే వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 యేళ్ళు నిండిన యువతీ యువకుల పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చని పక్షంలో "www.voters.eci.gov.in' అనే వెబ్ సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. తుది ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన ప్రతి రాజకీయ పార్టీకి రెండు కాపీలను అందజేస్తామన్నారు. పూర్తి వివరాలు, సందేహాల నివృత్తి కోసం 1950 అనే నంబరు లేదా ప్రధాన ఎన్నికల అధికారి 1800 425 21950 అనే ఫోన్ నంబరులో సంప్రదించవచ్చని ఎన్నికల ప్రధానాధికారి అర్చనా పట్నాయక్ తెలిపారు.



ఓటర్ల జాబితాను ప్రకటిస్తున్న అర్చనా పట్నాయక్

చెన్నైలో 40 లక్షల మంది ఓటర్లు

చెన్నై నగరంలో మొత్తం 40 లక్షల మంది ఓటర్లున్నారు. చెన్నై మహానగరంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 40,15,878 మంది ఓటర్లుండగా, వీరిలో పురుష ఓటర్లు 1,97,0279 మంది, మహిళా ఓటర్లు 20,44,323 మంది, ట్రాన్స్‌జెండర్లు ఓటర్లు 1,276 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గాల్లో అత్యధికంగా వేళచ్చేరిలో 3,16,642 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్ప ఓటర్లు హార్బర్ నియోజకవర్గంలో ఉన్నారు.

ప్రభుత్వ ప్రసంగ పాఠం చదవడం ఇష్టం లేకనే...!

● గవర్నర్ నిష్క్రమణపై స్పీకర్ అప్పావు ఆగ్రహం

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదివేందుకు ఇష్టం లేకనే జాతీయ గీతాన్ని సాకుగా పెట్టుకుని గవర్నర్ రవి సభ నుండి నిష్క్రమించారని స్పీకర్ అప్పావు ఆరోపించారు. శాసనసభలో జరిగిన ఘటనపై ఆయన మీడియా సమావేశంలో వివరించారు. కాంగ్రెస్ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సభ్యులు ప్లకార్డులు పట్టుకుని సభకు వచ్చాన్నారు. అన్నాయూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ అన్నాడీఎంకే సభ్యులు ప్లకార్డులతో నినాదాలు చేశారని, అన్నా వర్సిటీ ఛాన్సలర్‌గా ఉన్న గవర్నర్‌కు వ్యతిరేకంగా వారు ఈ ఆందోళనకు దిగినట్లు తాను భావిస్తున్నానన్నారు. ఈ విషయమై అన్నాడీఎంకే సభ్యులెవరూ తనకు స్పష్టమైన వివరణ కూడా ఇవ్వలేదన్నారు. గవర్నర్ రవి ప్రసగించేందుకు లేచినప్పుడే అన్నాడీఎంకే సభ్యులంతా లేచి చేత ప్లకార్డులు ప్రదర్శించారని స్పీకర్ చెప్పారు. సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్నప్పుడు గానీ, తాను మాట్లాడుతున్నప్పుడు గానీ వారు ప్లకార్డులు ప్రదర్శించలేదన్నారు. గవర్నర్ ప్రసంగానికి ఆటంకం కలిగించేలా వ్యవహరించినందువల్లే అన్నాడీఎంకే సభ్యులను సభ నుండి గెంటి వేసినట్లు తెలిపారు. ఇక గవర్నర్ వాకౌట్ గురించి సభాపక్ష నాయకుడు, సీనియర్ మంత్రి దురైమురుగన్ సుదీర్ఘ వివరణ ఇచ్చారని తెలిపారు. రాజ్యాంగ ధర్మాసనం 176 (1) సెక్షన్ ప్రకారం కొత్త సంవత్సరంలో తొలి శాసనసభ సమావేశంలో గవర్నర్ ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదవాలని సుస్పష్టంగా పేర్కొన్నారని, అయితే గవర్నర్ రవి తన ప్రజాస్వామ్య బాధ్యతలను నెరవేర్చడానికి బదులుగా ముచ్చటగా మూడోసారి సభ నుండి నిష్క్రమించారని చెప్పారు. 1921 నుండి శాసనసభలో కొత్త సంవత్సరం ఆరంభంలో గవర్నర్లు ప్రసంగిస్తూ వచ్చారని, ఏ గవర్నర్ కూడా శాసనసభలో ముందుగా జాతీయ గీతం ఆలపించాలని ఒత్తిడి చేయలేదన్నారు. గవర్నర్ ప్రసంగానికి ముందు తమిళ్‌తాయ్ ప్రార్థన, ప్రసంగం ముగిసిన తర్వాత జాతీయ గీతం ఆలపించడం ఆనవాయితీగా వస్తోందని స్పీకర్ వివరించారు.

హుందాగా వ్యవహరించిన చెన్నారెడ్డి...

గవర్నర్‌కు అందించిన ప్రభుత్వ ప్రసంగ పాఠం యథాతథంగా సభ రికార్డుల్లో నమోదవుతుందని, ఇందులో ఎలాంటి మార్పులు, చేర్పులకు తావుండదని తెలిపారు. 1995లో శాసనసభలో అప్పటి గవర్నర్ మర్రి చెన్నారెడ్డిని రీకాల్ చేయాలని కేంద్రాన్ని కోరటమే కాకుండా, కొత్త గవర్నర్‌ను తనకు తెలిపిన తర్వాతే నియమించాలంటూ నాటి సీఎం జయలలిత తీర్మానం చేశారని, ఇంత జరిగినా మరుసటి యేడాది, అంటే 1996 గవర్నర్ మర్రి చెన్నారెడ్డి శాసనసభలో ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదివి హుందాగా వ్యవహరించారని గుర్తు చేశారు. గవర్నర్ ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదవాలని, ఆ హక్కు మాత్రమే ఆయనకుందన్నారు. ప్రసంగపాఠంలో మార్పులు, చేర్పులు చేసే హక్కు ఎవరికీ లేదన్నారు.

ఇష్టం లేకనే వాకౌట్

ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదివేందుకు ఇష్టం లేకనే జాతీయ గీతాన్ని సాకుగా పెట్టుకుని గవర్నర్ రవి సభ నుండి నిష్క్రమించారని స్పీకర్ అప్పావు ఆరోపించారు. శాసనసభలో పాల్గొనాలని ఆహ్వానించేందుకు రాజ్‌భవన్‌కు వెళ్ళినప్పుడు గవర్నర్ తగిన విధంగానే తనను ఆహ్వానించారని, ఆ సందర్భంగా ఇరువురి మధ్య ఎలాంటి వివాదాస్పదమైన చర్చలు చోటుచేసుకోలేదన్నారు. గవర్నర్ వరుసగా మూడేళ్లపాటు ప్రసంగాన్ని పూర్తిగా చదవకుండా రాజ్యాంగ ధర్మాసనానికి వ్యతిరేకంగా వ్యవహరించడం భావ్యమేనా అనే ప్రశ్నకు ప్రజలే బదులివ్వాలని స్పీకర్ అప్పావు వ్యాఖ్యానించారు.

గవర్నర్‌ది చిన్నపిల్లాడి మనస్తత్వం

● ఆయన తీరు ఆ పదవికే కళంకం ● అలాగే అంటిపెట్టుకుని ఉంటారా?
● గవర్నర్‌పై స్టాలిన్ ధ్వజం ● గవర్నర్ ప్రసంగానికి ముందు తమిళ్‌తాయ్
● చివర్లో జాతీయ గీతాలాపన శాసనసభ సంప్రదాయం

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం తనకు కల్పించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేని గవర్నర్ ఆర్ఎన్ రవి ఇంకా ఆ పదవిని అంటిపెట్టుకుని ఉండటం గర్హనీయమని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఘాటుగా విమర్శించారు. శాసనసభలో ప్రభుత్వ ప్రసంగపాఠాన్ని చదవకుండా గవర్నర్ సభ నుండి నిష్క్రమించడం ఆయన చిన్నపిల్లాడి మనస్తత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. రాజ్యాంగ ధర్మాసనం ప్రకారం యేడాది ప్రారంభంలో జరిగే మొదటి శాసనసభ సమావేశంలో ప్రభుత్వ ప్రసంగం చదవడం సంప్రదాయంగా వస్తోందని, శాసనసభను అగౌరవపరచడమే ఆనవాయితీగా పెట్టుకున్న గవర్నర్ చర్యలు ఆయన పదవికి కళంకాన్ని ఆపాదిస్తున్నాయని తెలిపారు. తన రాజ్యాంగ విధులను బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు మనసొప్పని వ్యక్తి ఇంకా ఆ పదవిని అంటిపెట్టుకుని ఉండటం గర్హనీయమని పేర్కొన్నారు.



శాసనసభలో స్పీకర్ అప్పావు, ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి దురైమురుగన్ తదితరులు

విరుద్ధంగా నడచుకోమంటే ఎలా? : దురైమురుగన్

జాతీయగీతంపై తమకూ గౌరవం ఉందని, జాతీయ గీతాన్ని ఎప్పుడూ అవమానించలేదని సీనియర్ మంత్రి దురైమురుగన్ పేర్కొన్నారు. శాసనసభలో గవర్నర్ వాకౌట్ చేయడంపై వివరణ ఇస్తూ ఓ తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తీర్మానం ప్రకారం గవర్నర్ ప్రసంగం పాఠంలోని అన్ని అంశాలు, చేర్పులు, మార్పులకు తావు లేకుండా యథాతథంగా సభ రికార్డుల్లో పొందుపరచాలని కోరారు. ఆ తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్లు స్పీకర్ అప్పావు ప్రకటించారు. శాసనసభలో దశాబ్దాల తరబడి గవర్నర్ ప్రసంగానికి ముందు తమిళతల్లి ప్రార్థన, ప్రసంగం ముగిశాక జాతీయ గీతం ఆలాపించడం ఆనవాయితీ అని, సభా సంప్రదాయాన్ని చెడగొట్టేందుకు గవర్నర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 2023లో గవర్నర్ రవి ప్రసంగ పాఠంలో కొన్నివ్యాఖ్యాలు చేర్చి ప్రసంగించారని, అప్పట్లో సభ్యులంతా నిరసన తెలిపారన్నారు. గత యేడాది కూడా జాతీయ గీతాన్ని ముందుగా ఆలపించలేదని గవర్నర్ సభ నుండి నిష్క్రమించారని, అప్పట్లో ప్రభుత్వం ఆయనకు సమగ్రమైన వివరణ ఇచ్చిందని గుర్తు చేశారు. సభలో దశాబ్దాల తరబడి కొనసాగుతున్న సంప్రదాయాలను స్పష్టపరిచామన్నారు. ఇంతటి వివరణ ఇచ్చిన తర్వాత కూడా ఈ యేడాది గవర్నర్ మళ్లీ జాతీయ గీతం పాడలేదంటూ అలగడం సరి కాదని మంత్రి దురైమురుగన్ పేర్కొన్నారు.

ఎవరా సార్ ?

అసెంబ్లీ నుంచి గెంటివేత

ప్లకార్డులతో అన్నాడీఎంకే నిరసన

ప్యారీస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో తొలి రోజు అన్నాడీఎంకే నిరసనకు దిగింది. ఇటీవల అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనలో కీలకంగా వినిపిస్తున్న 'సార్' ఎవరంటూ ప్లకార్డులతో ఆందోళన చేపట్టింది. దీంతో సభా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతోందంటూ స్పీకర్ వారిని మార్షల్స్ చేత గెంటించారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమవుతుందని అందరూ ఎదురు చూశారు. గవర్నర్ ప్రసంగానికి ముందే అన్నా వర్సిటీ విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ, ఎవరా సార్? అనే నినాదంతో ముద్రించిన ప్లకార్డులను ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రదర్శించారు. అదేవిధంగా 'ఎవరా సార్?' అనే బ్యాడ్జీని ధరించారు. ఈలోపు గవర్నర్ సభ నుంచి నిష్క్రమించారు. కాగా గవర్నర్ ప్రసంగం తమిళ అనువాదాన్ని స్పీకర్ అప్పావు చదువుతుండగానే అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు లేచి నిలబడి ఎవరా సార్? అంటూ నినాదాలు చేపట్టారు. దీంతో స్పీకర్ అన్నాడీఎంకే సభ్యులను మార్షల్స్‌తో బయటకు పంపించారు.



అసెంబ్లీ ప్రాంగణంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

ప్రశ్నిస్తే భయమెందుకు?..ఈపీఎస్

అన్నా వర్సిటీ విద్యార్థినికి సంబంధించిన అత్యాచారం కేసుతో ముడిపడి ఉన్న రెండో వ్యక్తి ఎవరని ప్రశ్నిస్తే ప్రభుత్వ పెద్దలు ఎందుకు భయపడుతుందని ఈపీఎస్ ప్రశ్నించారు. అసెంబ్లీ నుంచి గెంటివేసిన అనంతరం సచివాలయ ప్రాంగణంలో ఎడప్పాడి పళనిస్వామి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలను గవర్నర్ బహిష్కరించలేదని, ఉద్దేశపూర్వకంగానే ఆయన్ని సభ నుంచి బయటకు పంపించారని ఈపీఎస్ ఎద్దేవా చేశారు. స్పీకర్ అప్పావు అసెంబ్లీ తొలి సమావేశంలో చదివింది గవర్నర్ ప్రసంగం కాదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించడంతో చిన్నారుల నుండి పెద్దల వరకు లైంగిక వేధింపులకు గురౌతున్నారని ఈపీఎస్ మండిపడ్డారు.

ద్వితీయ ఆర్థిక మండలిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

- మెకెదాటును అడ్డుకుంటాం
- మహిళా స్వయంసమృద్ధికి అగ్రతాంబూలం
- వృత్తి విద్యాకోర్సుల్లో 7.5 శాతం రిజర్వేషన్
- గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం ప్రకటన

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాలను ఆర్థికంగా అభివృద్ధిపరచి దేశంలోనే రాష్ట్రాన్ని ద్వితీయ ఆర్థిక మండలిగా మార్చటమే ప్రధాన ధ్యేయమని అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం ప్రకటించింది. సోమవారం ఉదయం ప్రారంభమైన శాసనసభ సమావేశంలో గవర్నర్ ఆంగ్ల ప్రసంగం తమిళ అనువాదాన్ని స్పీకర్ అప్పావు చదివి వినిపించారు. గతంలో స్థూల జాతీయోత్పత్తిలో రాష్ట్రం 5.4 శాతంలో ఉండేదని, ప్రస్తుతం 9.21 శాతానికి పెరిగిందని, 2030లోగా ట్రిలియన్ ఆర్థికాభివృద్ధిని సాధించటం డీఎంకే ద్రావిడ తరహా పాలన ముఖ్యోద్దేశమని తెలిపారు. కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం, సిటీ, టవున్ బస్సులలో మహిళల వెలుగుబాట (ఉచిత) ప్రయాణ పథకం, ప్లస్-2 దాకా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత విద్యాకోర్సులలో చేరే విద్యార్థినికి అమలు చేస్తున్న పుదుమైపెణ్ పథకం సమర్థవంతంగా అమలు చేయడం వల్ల మహిళలంతా ఆర్థికపరంగా స్వయం సమృద్ధిని సంపాదించుకున్నారన్నారు. కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కింద ప్రతినెల 1.15 కుటుంబాలకు ప్రతినెలా రూ.1000లను అందిస్తున్నట్లు వివరించారు.

2.5 లక్షల మందికి ఉద్యోగాలు..

రాష్ట్ర ప్రభుత్వం నాన్ ముదల్వన్ పథకం కింద విద్యార్థులకు ప్రతిభాపాటవాలను మెరుగుపరిచేలా అమలు చేస్తున్న ప్రత్యేక శిక్షణ ద్వారా ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల మంది విద్యార్థులు ఉద్యోగవకాశాలు పొందారని తెలిపారు. ఈ రీతిలోనే కొత్త పరిశ్రమల స్థాపనకు రాయితీలు ప్రకటించడం వల్ల ఆ పరిశ్రమలలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయని ఆ ప్రసంగంలో తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం మెకెదాటు వద్ద కొత్త ఆనకట్ట నిర్మించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంటుందని, ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెస్తుందన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ రూ.1916 కోట్లతో అత్తికడవు - అవినాశి పథకాన్ని అమలు చేయడం వల్ల 15 టీఎంసీల సాగుజలాలు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వృత్తివిద్యాకోర్సులలోనూ 7.5 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నామని, దీంతో నిరుపేద, దారిద్ర్యరేఖకు దిగువగా ఉన్న విద్యార్థులకు సాంకేతిక విద్య సులువుగా అందుతుందని ఆ ప్రసంగంలో తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 10 వేల కిలోమీటర్ల పొడవు రహదారులను అభివృద్ధి పరచనున్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విద్యాశాఖకు విడుదల చేయాల్సిన రూ.2152 కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వం డిమాండ్ చేసింది. మదురై, కోయంబత్తూరు నగరాలలో మెట్రోరైలు పథకాల అమలుకు కేంద్రం త్వరగా అనుమతివ్వాలని కూడా ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ కబ్జాకు గురైన రూ.6882 కోట్ల విలువైన ఆలయ ఆస్తులను కూడా స్వాధీనం చేసుకుంది. పారిశ్రామికపరంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఉత్తర చెన్నై అభివృద్ధి పథకాన్ని రూ.6309 కోట్లతో అమలు చేస్తున్నట్లు పేర్కొంది. ఇన్నుయిర్ కాప్పోం పథకం ద్వారా సుమారు 3లక్షల మంది ప్రాణాలను కాపాడామని, చెన్నై నగరం అంతర్జాతీయ పరంగాను మెడికల్ హబ్‌గామారిందని, ఆ దిశగా సుమారు 15 లక్షల మంది విదేశీయులు వచ్చి వైద్యం చేయించుకున్నారని తెలిపారు. రాష్ట్ర రవాణా సంస్థ ద్వారా ప్రయాణికులకు మరిన్ని సదుపాయాలు కల్పించే దిశగా కొత్త 6104 బస్సులను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది.

యువతి అనుమానాస్పద మృతి



ప్యారీస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం చేసుకున్న యువతి ఏడాది వ్యవధిలోనే అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన తిరువళ్లూరు జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఆవడిలోని వెళ్లాలర్ నగర్‌కి చెందిన రుక్మిణి(24) గత ఏడాది మార్చిలో అదే ప్రాంతానికి చెందిన జోసఫ్ అనే యువకుడ్ని ప్రేమించింది. వారి వివాహానికి కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయి జోసఫ్‌ను వివాహం చేసుకుని నేతాజీ నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. పెళ్లైన ఏడాది వరకు వారి సంసారం బాగానేవుండింది. కానీ కొన్ని రోజులుగా భార్యా భర్తల మధ్య తరుచూ గొడవలు ప్రారంభమైయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఉన్నట్లుండి రుక్మిణి నేతాజీ నగర్‌లోని తన ఇంట్లో ఉరి వేసుకొని కనిపించింది. కిటికీలోంచి అది చూసిన పక్కింటి వాళ్లు కేకలు వేయగా చుట్టుప్రక్కల వారు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు స్థానికులను విచారించగా, కొద్దిరోజులుగా వారిద్దరు గొడవలు పడుతుండటంతో చుట్టుప్రక్కల వారు నచ్చచెప్పినట్లు తెలిపారు. ఈ క్రమంలో నాలుగు రోజులుగా ఆమె భర్త జోసఫ్ కనిపించడం లేదని, రుక్మిణి అనుమానాస్పదంగా మృతి చెందడం బాధాకరమని తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు నమోదు చేసుకున్న పోలీసులు భర్త జోసఫ్ కోసం గాలిస్తున్నారు.

బార్‌లో అసభ్య నృత్యాలు

ఐసిఎఫ్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంజీఆర్ నగర్‌లోని ఓ బార్‌లో అసభ్య నృత్యాలు నిర్వహించిన వ్యవహారంలో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై పోలీసులు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... జాఫర్‌ఖాన్‌పేట పిళ్లయార్ ఆలయ వీధిలోని ఓ ప్రైవేటు బార్‌లో, మహిళలతో అసభ్య నృత్యాలు చేయిస్తున్నారంటూ ఎంజీఆర్ నగర పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. దీంతో, శనివారం రాత్రి పోలీసులు ఆ బార్‌లో తనిఖీ చేసి, డీజేతో మహిళలు అసభ్య నృత్యాలు చేస్తుండడం గమనించారు. ఆ సమయంలో పోలీసులను బెదిరించిన బార్ యజమాని ధాను, క్యాషియర్ విజయ్ అమృత్‌రాజ్, ఆర్గనైజర్ వినోద్‌లను అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం వారిని సోమవారం కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు నగర పోలీసు శాఖ తెలిపింది.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

ఐసిఎఫ్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. నామక్కల్ జిల్లా తిరుచెంగోడు మొళిపచ్చపాలి ప్రాంతానికి చెందిన తంగరాజ్, కుమారుడు అరుళ్, కుమార్తె శరణ్యతో కలసి నదులు, చెరువుల్లో చేపలు పడుతుంటాడు. వారు ముగ్గురు ఆదివారం చేపలు పట్టేందుకు ఈరోడ్ జిల్లా కొడుముడి సమీపం బాచూరులోని కావేరి నదికి వెళ్లారు. నదిలో గాలాలు వేసి వీరు ఒడ్డున కూర్చున్నారు. ఆ సమయంలో సమీపంలోని కొండల నుంచి వచ్చిన తేనెటీగలు వీరిపై దాడిచేశాయి. వాటి నుంచి తప్పించుకొనేందుకు ముగ్గురు పరుగులు తీయగా, అవి వారిని వెంటాడి దాడి చేశాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే తంగరాజ్ మృతిచెందినట్లు తెలిపిన వైద్యులు, అరుళ్, శరణ్యలకు చికిత్సలందిస్తున్నారు.

మద్యం మత్తులో కండక్టర్‌పై దాడి

- పోలీసులకి అప్పగించిన ప్రయాణికులు

ప్యారీస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా తిరుచెంగోడులో ప్రభుత్వ బస్సులో ఎక్కిన ప్రయాణికుడు టికెట్ తీసుకోమన్న కండక్టర్‌పై దాడికి యత్నించాడు. నామక్కల్ జిల్లా తిరుచెంగోడు నుండి పల్లిపాళెం వెళ్తున్న బస్సులో తాజ్ నగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి బస్సు ఎక్కాడు. ఈ క్రమంలో కండక్టర్ టికెట్టు తీసుకోవాలని కోరడంతో మద్యం మత్తులో ఉన్న ఆ వ్యక్తి, నన్ను టికెట్ అడుగుతావా? ఆడవాళ్లకు మాత్రమే ఉచిత బస్సు సౌకర్యమా? మగవాళ్లు కూడా ఉచితంగా ప్రయాణించకూడదా? అంటూ.. కండక్టర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఇంతలో ఆ వ్యక్తి చొక్కా పట్టుకుని కండక్టర్‌పై దాడికి యత్నించగా, ప్రయాణికులు అడ్డుకొని పోలీసులకు ఫోన్ చేశారు. పోలీసులు వెళ్లి ఆ వ్యక్తిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనను బస్సులోని ఓ ప్రయాణికుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, పలువురు నెటిజన్లు వైరల్ అవుతున్న ఈ వీడియో చూసి హాస్యాస్పదంగా కామెంట్లు చేస్తున్నారు.

- కల్తీ సారా మరణాలు...

18 మందిపై గూండా చట్టం రద్దు

ప్యారీస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి 70 మంది మరణించిన కేసులో అరెస్టయిన 18 మందిపై ప్రయోగించిన గూండా చట్టాన్ని మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. కళ్లకుర్చి నియోజకర్గ పరిధిలో ఆరు నెలల క్రితం కల్తీ సారాతాగి 70 మంది మరణించగా, మరి కొంతమందికి కంటి చూపు మందగించింది. రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించిన ఈ కేసుకు సంబంధించి పోలీసులు 18 మందిని అరెస్టు చేశారు. కళ్లకుర్చి ప్రాంతంలో సుమారు 110 రోజులు జన జీవనం స్థంబించడంతో నిందితులపై రాష్ట్రప్రభుత్వం గూండా చట్టం ప్రయోగించింది. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ 18 మంది నిందితుల తరుపున దాఖలైన పిటీషన్ విచారణ ముగిసింది. ఇందు వల్ల సోమవారం న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రహ్మణ్యం, జ్యోతిరామన్‌లతో కూడిన ధర్మాసనం పిటీషనర్లపై నమోదు చేసిన గూండా చట్టాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పంచాయతీల విలీనంపై ప్రజాగ్రహం



ఈరోడ్ కలెక్టర్ కార్యాలయ ముట్టడిలో ప్రజలు

వాషర్‌మెన్‌పేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీతో గ్రామ పంచాయతీలను విలీనం చేసే చర్యలు విరమించుకోవాలని కోరుతూ ఈరోడ్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ప్రజలు ముట్టడించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీ సరిహద్దుల్లోని అభివృద్ధి చెందిన గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఈరోడ్ జిల్లా పుంజైపులియంపట్టి మున్సిపాలిటీలో నల్లూరు, నోచ్చికుట్ట గ్రామ పంచాయతీలు విలీనం కానున్నాయి. వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం రెండు పంచాయతీల ప్రజలు కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. అలాగే, కార్పొరేషన్‌లో విలీనం కానున్న కదిరాంబట్టి, మేట్టునాసువంపాళయం పంచాయతీల ప్రజలు కూడా, ఈ చర్యలు విరమించుకోవాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

సీబీఐ విచారణకు రాజేంద్ర బాలాజి కేసు

- మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీపై నమోదైన కేసు విచారణ సీబీఐకి అప్పగించాలని విరుదునగర్ జిల్లా క్రిమినల్ కోర్టుకు మద్రాసు హైకోర్టు ఆదేశించింది. గత అన్నాడీఎంకే పాలనలో డెయిరీ శాఖ మంత్రిగా వ్యవహరించిన రాజేంద్ర బాలాజీ, ఆవిన్ సంస్థ సహా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలిప్పిస్తామని 33 మంది నుంచి రూ.3 కోట్లు వసూలుచేసి అవినీతికి పాల్పడ్డారని విరుదునగర్ జిల్లా క్రిమినల్ విభాగం పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో సత్వరం ఛార్జీషీటు దాఖలుచేసేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ రవీంద్రన్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో, ఈ కేసు విచారించిన మద్రాసు హైకోర్టు, కేసు సీబీఐకి అప్పగించాలని విరుదునగర్ జిల్లా క్రిమినల్ కోర్టుకు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం ఉత్తర్వులు అమలుచేసే తీరిక లేదని మద్రాసు హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తొలుత, విచారణ సమయంలో రాజేంద్ర బాలాజీకి వ్యతిరేకంగా కేసు నమోదు చేసేందుకు అనుమతికి చర్యలు తీసుకున్నట్లు పోలీసులు గతంలో కోర్టుకు తెలియజేశారు.

వలలో చిక్కిన మొసలి



మొసలిని బంధించిన జాలర్లు

వాషర్‌మెన్‌పేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాట్టుమన్నార్ కోయిల్ సమీపంలోని చెరువులో వేసిన వలలో మొసలి చిక్కుకోవడంతో స్థానికులను ఆందోళనకు గురిచేసింది. ఆరంతాంగి గ్రామానికి చెందిన కొందరు యువకులు ఆదివారం సాయంత్రం చెరువులో చేపలు పట్టేందుకు వల వేశారు. ఈ వలలో మొసలి చిక్కడం గమనించిన యువకులు, చిదంబరం ఫారెస్ట్ అధికారి వసంత భాస్కర్‌కు సమాచారం అందజేశారు. సిబ్బందితో అక్కడకు చేరుకున్న అధికారి, వలలో చిక్కిన 6 అడుగుల పొడవైన కలిగిన మొసలిని అనైక్కరై కొల్లిడం నదిలో వదలిపెట్టారు.

పథకం ప్రకారమే అసెంబ్లీ పరువుతీసిన గవర్నర్

- ఎండీఎంకే నేత వైగో ధ్వజం

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి శాసనసభ పరువు ప్రతిష్ఠతలను, ఎన్నికైన ప్రజా ప్రతినిధుల గౌరవాన్ని దిగజార్చేందుకు ముందుగానే పథకం వేసుకుని శాసనసభలో అడుగుపెట్టారని, జాతీయగీతం పాడలేదంటూ కుంటిసాకులు చెప్పుకుని ప్రసంగ పాఠాన్ని పఠించకుండా నిష్క్రమించారని ఎండీఎంకే ప్రధానకార్యదర్శి వైగో ధ్వజమెత్తారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ శాసనసభలో ఎన్నో ఏళ్లుగా పాటిస్తున్న సంప్రదాయాలను గౌరవించాలనే ఆలోచన గవర్నర్ రవికి ఏకోశానా లేదని జరిగిన సంఘటన రుజువుచేస్తోందన్నారు. ఇదే విధంగా డీపీఐ నాయకుడు తొల్ తిరుమావళవన్ కూడా గవర్నర్ రవి తీరును ఓ ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదువకూడదనే ముందుగానే పథకం వేసుకుని గవర్నర్ ఆ పదవికున్న హోదాను తనకుతానే తగ్గించుకుని జాతీయ గీతం పాడలేదంటూ సాకులు చెప్పుకుని సభ నుండి నిష్క్రమించారని పేర్కొన్నారు.

రెండు రోజుల్లో 50 పైసలు తగ్గిన కోడిగుడ్డు

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డు ధరలు రెండు రోజుల్లో 50 పైసలు తగ్గాయి. ఆ ప్రకారం, శనివారం 25 పైసలు తగ్గి రూ.5.05కి విక్రయమైన కోడిగుడ్డు, ఆదివారం మరో 25 పైసలు తగ్గి రూ.4.80కి విక్రయమైంది. కాగా, దుకాణాల్లో కోడిగుడ్డు ధర రూ.6గా ఉండడం గమనార్హం.

తెలంగాణా పోలీసులకు అరక్కోణంలో శిక్షణ



పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణా రాష్ట్ర పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి అరక్కోణంలో ఎనిమిది వారాల శిక్షణ ఆదివారం ప్రారంభమైంది. రాణిపేట జిల్లా అరక్కోణంలో ఎన్డీఆర్ఎఫ్ శిక్షణా కేంద్రం ఉంది. ఈ కేంద్రంలో తెలంగాణా రాష్ట్రానికి చెందిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మొత్తం 36 మంది శిక్షణ కోసం వచ్చారు. తొలిరోజు శిక్షణలో భాగంగా వర్షాకాలంలో వరదల్లో చిక్కుకున్న వారిని తాళ్ల సాయంతో ఎలా రక్షించాలి, ఎత్తైన భవనంపై ఏర్పడిన అగ్నిప్రమాదంలో చిక్కుకున్న వారిని తాళ్ల ద్వారా రక్షించడం తదితరాలపై శిక్షణ ఇచ్చారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు



పోటీల్లో పరుగులు తీస్తున్న ఎద్దులు

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొంగల్ వేడుకలు ప్రారంభమయ్యాయి. పొంగల్ సందర్భంగా జల్లికట్టు, ఎద్దులు వదిలే పోటీలు, ఎడ్ల బండ్ల పందేలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది రాష్ట్రంలో తొలి జట్టుకట్టు పోటీలు పుదుకోట జిల్లా తంగకుర్చిలో శనివారం జరిగాయి. అలాగే, శివగంగ జిల్లా పూవంది గ్రామంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం, పొంగల్ సందర్భంగా ఆదివారం ఎడ్ల పందేలు నిర్వహించారు. పెద్ద ఎద్దులు, చిన్న ఎద్దులు అని రెండు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 51 జతలు ఎద్దులు పాల్గొన్నాయి. వీటిలో పెద్ద ఎద్దులకు 8 కి.మీ, చిన్న ఎద్దులకు 6 కి.మీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలిచిన ఎద్దులు, వాటి యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

సమాచార దర్శిని

28 మంది డీఆర్వోల బదిలీ

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 28 మంది జిల్లా రెవెన్యూ అధికారులను (డీఆర్వో) బదిలీ చేశారు. అలాగే, 30 మంది సబ్ కలెక్టర్లు డీఆర్వోలుగా పదోన్నతి పొందారు. తేని, దిండుగల్, అరియలూరు, మదురై, తూత్తుకుడి, సేలం, కళ్లకుర్చి, చెంగల్పట్టు డీఆర్వోలు సహా పలు జిల్లాల్లో పనిచేస్తున్న మొత్తం 28 మందిని బదిలీ చేశారు. అదే సమయంలో, ఆర్డీవో సహా పలు పదవుల్లో ఉన్న వారు, సబ్ కలెక్టర్లు మొత్తం 30 మందిని జిల్లా రెవెన్యూ అధికారులుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం ఉత్తర్వులు జారీచేశారు.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు వచ్చే నీటి ప్రవాహం తగ్గింది. డ్యాంకు ఆదివారం 1,307 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, సోమవారం ఉదయం 828 ఘనపుటడుగులకు తగ్గింది. డ్యాంలోని నీటి రాక తగ్గడం, విడుదల పెరగడంతో నీటిమట్టాలు క్రమంగా తగ్గుతున్నాయి. ప్రస్తుతం డ్యాంల 117.87 అడుగులు (డ్యాం పూర్తి సామర్థ్యం 120 అడుగులు) అని, 90.11 టీఎంసీల నీటినిల్వలున్నాయని అధికారులు తెలిపారు.

చదురగిరికి భక్తుల అనుమతి

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా పశ్చిమ కనుమల కొండల్లో వెలసిన చదురగిరి ఆలయానికి భక్తులను అనుమతించనున్నారు. ప్రదోషం, పౌర్ణమి సందర్భంగా ఈ నెల 11 నుంచి 14వ తేది వరకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను కొండ ఆలయానికి అనుమతించనున్నారు. భక్తులు రాత్రి వేళ ఆలయంలో బసచేసేందుకు అనుమతించమని, కొండ ప్రాంతాల్లోని జలపాతాల వద్ద భక్తుల స్నానాలకు నిషేధం విధించారు. అనుమతించిన రోజుల్లో వర్షాలు కురిస్తే భక్తుల అనుమతి రద్దు చేస్తామని జిల్లా యంత్రాంగం తెలిపింది.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయాలని ఆరోగ్య శాఖ డైరెక్టర్ డా.సెల్వవినాయగం ఆదేశించారు. ఈ మేరకు ఆ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... జన్మించిన శిశువు నుంచి 18 ఏళ్లలోపున్న వారికి సంక్రమించే 30 రకాల వ్యాధులను ముందుగా గుర్తించాలని జాతీయ పిల్లల సంక్షేమ వైద్య పరిశోధన పథకం (ఆర్‌పీఎస్కే) రాష్ట్రంలో అమలులో ఉందన్నారు. ఆ ప్రకారం, ప్రతి ఏడాది 1.45 కోట్ల మంది పిల్లలకు ఆయా పాఠశాలల్లోనే రెండు సార్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్య అధికారి, నర్సు, వైద్య అసిస్టెంట్, డ్రైవర్‌తో కూడిన 805 వైద్య బృందాలున్నాయని, పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్సలు అందించాలని ఆరోగ్యశాఖ తెలిపింది.

రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.15వేల కోట్ల ఆదాయం

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.15వేల కోట్ల ఆదాయం సమకూరింది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ శాఖ విడుదల చేసిన ప్రకటనలో, 2024-25వ ఆర్థిక సంవత్సరం గత ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.25 లక్షల 3 వేల 365 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.15,582 కోట్లు ఆదాయం సమకూరింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 24 లక్షల 93 వేల 80 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.13,610 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అదనంగా 10,285 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.1,972 కోట్లు ఆదాయం పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి మార్చి వరకు రూ.17,296 కోట్లు ఆదాయం సమకూరగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో రెండున్నర నెలలు ఉండడంతో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం రూ.18,000 కోట్లకు చేరే అవకాశముందని అధికారులు తెలిపారు.

ఊయల తాడు చుట్టుకొని విద్యార్థిని మృతి



రీతువర్షిణి (ఫైల్‌ఫొటో)

వాషర్‌మెన్‌పేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఉయ్యాల ఊగుతున్న విద్యార్థిని మెడకు తాడు చుట్టుకొని ఊపిరాడక మృతిచెందిన ఘటన కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. పెన్నాడం సమీపం కోనూర్ గ్రామానికి చెందిన ముత్తులింగం-అనిత దంపతులకు చంద్రు అనే కుమారుడు, రీతువర్షిణి (13) అనే కుమార్తె ఉంది. ముత్తులింగం విదేశాల్లో ఉద్యోగం చేస్తుండగా, అనిత పిల్లలతో కోనూరులో నివసిస్తోంది. ఆదివారం ఉదయం అనిత పొలం పనులకు వెళ్లింది. ఇంటి ప్రాంగణంలోని చెట్టుకు తాడుతో ఊయల కట్టుకొని ఊగుతున్న సమయంలో, రీతువర్షిణి మెడకు తాడు చుట్టుకుంది. చుట్టుపక్కల వారు ఆమెను వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పెన్నాడం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పొంగల్‌కు 14,104 ప్రత్యేక బస్సులు

- రవాణా శాఖామంత్రి శివశంకర్

ప్యారీస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా సొంతూర్లకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం రాజధాని నగరం చెన్నై నుంచి 14,104 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖామంత్రి ఎస్ఎస్ శివశంకర్ ప్రకటించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి సోమవారం మీడియాతో మాట్లాడారు. పొంగల్ పండుగ కోసం సొంతూర్లకు వెళ్లే ప్రజల కోసం ప్రభుత్వ రవాణా సంస్థల ద్వారా ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. రోజూ నడుపుతున్న 2,092 బస్సులతో కలిపి 5,736 ప్రత్యేక బస్సులను నాలుగు రోజులు 14,104 బస్సులు, ఇతర ప్రాంతాల నుంచి నాలుగు రోజులు 7,800 బస్సులు మొత్తం 21 వేల బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి కోయంబేడు, మాధవరం, కిలాంబాక్కం బస్‌స్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులు నడపడానికి తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రిజర్వేషన్...

కిలాంబాక్కం బస్ టెర్మినల్‌లో టికెట్టు రిజర్వేషన్ కోసం తొమ్మిది కౌంటర్లను ప్రారంభించామని, ఇది కాకుండా ఆన్‌లైన్లో కూడా ప్రజలు టికెట్లు రిజర్వేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. పొంగల్ పండుగ సీజన్‌లో రద్దీని ఆసరాగా చేసుకొని ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేయరాదని ఆమ్ని బస్సుల యాజమాన్యాన్ని ఆదేశించినట్లు మంత్రి శివశంకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ పురిటిబిడ్డ మృతి

- ఆస్పత్రి యాజమాన్యంపై తండ్రి ఫిర్యాదు

ప్యారీస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తొమ్మిది రోజుల పసికందు మృతి చెందడంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే, క్రోంపేటలోని చిట్లపాక్కం ప్రాంతంలో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న యువరాజ్ గత నెల 28వ తేదీ గర్భంతో ఉన్న తన భార్య రాధికకు పురిటినొప్పులు రాగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో ఆమె ఒక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కానీ ఎనిమిదో నెలకే పుట్టిన ఆ బిడ్డకు కామెర్లు, బరువు తక్కువగా ఉండటంతో చికిత్స నిమిత్తం ఓ ప్రవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం చికిత్స పొందుతున్న ఆ బిడ్డకు హఠాత్తుగా ఊపిరి ఆడక మృతిచెందినట్లు ఆస్పత్రి యాజమాన్యం నిర్ధారించింది. ఈ విషయం తెలిసి మనస్తాపానికి గురైన బిడ్డతండ్రి యువరాజ్ ఆ ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆవేశంతో ఆస్పత్రి అద్దాలను పగులగొట్టాడు. ఈ క్రమంలో అతని చేతికి పగిలిన గాజు ముక్కలు గుచ్చుకుని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం



చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులున్న శాసనసభను అగౌరవపరచిన గవర్నర్ ఆర్ఎన్ రవి తీరును ఖండిస్తూ కాంగ్రెస్ సభ్యులు అసెంబ్లీ నుండి వాకౌట్ చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడు సెల్వపెరుంతగై అసెంబ్లీ బయట మీడియాతో మాట్లాడుతూ.. గవర్నర్ ముందుగా పథకం వేసుకునే ప్రసంగ పాఠం చదవకుండా వాకౌట్ చేసి శాసనసభ పరువు దిగజార్చారని ఆరోపించారు. తమిళుల సంక్షేమానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న గవర్నర్ ధోరణిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రతివిషయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారని ఆరోపించారు. గవర్నర్ చర్యలన్నీ పరిశీలిస్తే రాష్ట్రంలో పోటీ ప్రభుత్వం నడిపేందుకే ఆయన ప్రయత్నిస్తున్నట్లు అవగతమవుతోందన్నారు. డీఎంకే ప్రభుత్వం తొలి నుండి వ్యతిరేకిస్తున్న నీట్, త్రిభాషా విధానాన్ని, సనాతన ధర్మానికి గవర్నర్ వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు.

ప్రజాస్వామ్యంలో ఆందోళనలకు హక్కు ఉంది

- పీఎంకే శాసనసభ పక్షనేత జీకే మణి



సమావేశంలో ప్రసంగిస్తున్న జీకే మణి

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేస్తున్నారని, ప్రజాస్వామ్యంలో ఆందోళన చేసే హక్కుందని పీఎంకే శాసనసభ పక్ష నేత జీకే మణి పేర్కొన్నారు. శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభం కాగా, పీఎంకే సమావేశాల నుంచి వాకౌట్ చేసింది. అనంతరం సచివాలయం ప్రాంగణంలో జీకే మణి మీడియాతో మాట్లాడుతూ... గవర్నర్ ప్రసంగంతో శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, తమ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశామన్నారు. అన్నా వర్శిటీ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసులో ప్రభుత్వం చర్యలు సరిగా లేదన్నారు. ప్రభుత్వ తీరును ఖండిస్తూ ఆందోళనలు చేపడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదన్నారు. డీఎంకే కూటమి పార్టీలు కూడా ప్రభుత్వ చర్యలు ఖండిస్తున్నాయని జీకే మణి పేర్కొన్నారు.



సోమవారం రేషన్ కార్డుదారులకు మునుపటిలా సంక్రాంతి కానుక సరకులతో పాటు రూ.1000 నగదును కూడా అందించాలని డిమాండ్ చేస్తూ మధురవాయల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డీఎండీకే నాయకురాలు ప్రేమలత తదితరులు



వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఓటరు జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి (చిత్రంలో) జిల్లా తహసీల్దార్ బాలసుబ్రమణ్యం, ఎన్నికల తహసీల్దార్ సత్యమూర్తి తదితరులు

హీరో విశాల్ నా తమ్ముడు

● దర్శకుడు సుందర్



'మదగజరాజా' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న సుందర్, విశాల్ తదితరులు

కార్తీక్ ముత్తురామన్ మా అన్న అయితే హీరో విశాల్ తమ్ముడు వంటివాడు అని దర్శక నటుడు సుందర్ సి అన్నారు. ఆయన దర్శకత్వంలో విశాల్, సంతానం, అంజలి, వరలక్ష్మి, మనోబాలా, మొట్టై రాజేంద్రన్ తదితరులు నటించిన 'మదగజరాజా' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఆదివారం రాత్రి నగరంలో నిర్వహించారు. దర్శకుడు సుందర్ , నటి ఖుష్బూ, విజయ్ ఆంటోనీ, విశాల్ తదితరులు పాల్గొన్నారు. హీరో విజయ్ ఆంటోనీ సంగీతం అందించిన ఈ సినిమా పొంగల్ కానుకగా ఈ నెల 12వ తేదీ విడుదల చేస్తున్నారు. ఈ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో దర్శకుడు సుందర్ మాట్లాడుతూ, 'జెమిని ఫిల్మ్ సర్క్యూట్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం షూటింగ్ 2013లోనే పూర్తి చేసుకుంది. కొన్ని సమస్యల కారణంగా 12 యేళ్ళ తర్వాత రిలీజ్ చేయలేకపోయాం. ఈ సినిమా విజయంతో జెమిని ఫిల్మ్ సర్క్యూట్ మళ్ళీ వరుస చిత్రాలు నిర్మించాలి. ఈ సినిమా కోసం హీరో విశాల్ పడిన కష్టాలు బాహ్య ప్రపంచానికి తెలియకుండా పోయాయి. మాటల సందర్భంగా 8 ప్యాక్ కావాలని చెప్పగా, ఆ విధంగానే విశాల్ రెడీ అయ్యారు. కానీ, సినిమాలో ఎక్కడా కూడా 8 ప్యాక్ సన్నివేశాలు లేవు. ఇలాంటి కష్టాలు ఎన్నో ఉన్నాయి. నా గురువు మణివన్నన్ నటించిన చివరి చిత్రం ఇది. ఆయనతో పాటు మనోబాలా ఇపుడు భౌతికంగా మనమధ్య లేరు. విశాల్, సంతానం, మొట్టై రాజేంద్రన్‌ల మధ్య వచ్చే 15 నిమిషాల సన్నివేశం సినిమాకు హైలెట్‌గా నిలుస్తుంది' అన్నారు. విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో విశాల్ గాయకుడుగా మారారు. ఆ పాట పాడిన విశాల్ ఇకపై భవిష్యత్‌లో నేపథ్యగానం చేయడు' అన్నారు. హీరో విశాల్ మాట్లాడుతూ, 'పూర్తి వినోదభరిత చిత్రం. ప్రేక్షకుడు వందశాతం సంతృప్తితో థియేటర్ నుంచి బయటకు వస్తాడు. నేను పాడిన పాటక ఖచ్చితంగా అవార్డు వస్తుందని భావిస్తున్నా' అని పేర్కొన్నారు.

సినిమాల్లో రాజకీయాలు ఉండొచ్చు.. కానీ

ఆర్‌వి ఉదయకుమార్



'కన్నీరా' ఆడియో రిలీజ్ దృశ్యం

సినిమాల్లో రాజకీయాలు ఉండొచ్చని కానీ, రాజకీయాల్లో సినిమాలు ఉండకూడదని, అలావుంటే చిత్రపరిశ్రమ పతనానికి నాందిపలుకుతుందని సీనియర్ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి. ఉదయకుమార్ అభిప్రాయపడ్డారు. ఉత్రా ప్రొడక్షన్స్, మోర్ ఫర్ ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'కన్నీరా'. కదిరవన్ కథ సమకూర్చి దర్శకత్వం వహించడంతో పాటు కథానాయకుడిగా కూడా నటించారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ విడుదల కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. ఇందులో దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్, కోశాధికారి పేరరసు,

చిత్రజ్యోతి

సీనియర్ నటుడు కె.రాజన్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఈ వేడుకలో దర్శకుడు ఆర్వీ.ఉదయకుమార్ మాట్లాడుతూ, 'మంచి కంటెంట్‌తో సినిమాలు తీస్తే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. చిత్రపరిశ్రమలో ఇపుడు ఆరోగ్యకరమైన వాతావరణం కనిపించడం లేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి సందర్భం వచ్చినపుడల్లా తీసుకెళుతున్నాం. కానీ, థియేటర్‌లో పరిస్థితి మరోలా ఉంది. ఎంజీఆర్ అధికారంలో ఉన్నపుడు ఈ పరిస్థితి లేదు. సినిమాల్లో రాజకీయాలు ఉండొచ్చు.. కానీ రాజకీయాల్లో సినిమా ఉండరాదు.. ఒక వేళ ఉంటే ఆ పరిశ్రమ అధోగతిపాలవుతుంది' అన్నారు. మరో దర్శకుడు పేరరసు మాట్లాడుతూ, 'సినిమా అత్యంత క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటూ ప్రమాదంలో ఉంది. చిన్న సినిమాలకు ఆదరణ కరువైందని, చిన్న సినిమాలను చూసేందుకు ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదని చెబుతున్నారు. దీనిపై సీరియస్‌గా దృష్టి సారించాలి అని పేర్కొన్నారు. సీనియర్ నిర్మాత కె.రాజన్ మాట్లాడుతూ, 'చిన్న సినిమాలకు టిక్కెట్ ధరలను రూ.40, రూ.50, రూ.70గా ఖరారు చేయాలి' అని కోరారు. దర్శక హీరో కదిరవన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కథ నా భార్య రాశారు. ఆమె దర్శకత్వం వహించాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల అది సాధ్యపడలేదు. అన్ని వర్గాల ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది' అని పేర్కొన్నారు.

సమాజం మెప్పుపొందేలా సేవా కార్యక్రమాలుండాలి

అంతర్జాతీయ వాసవి క్లబ్‌ల అధ్యక్షుడు ఎరుకుల రామకృష్ణ



నూతన క్యాబినెట్ నిర్వాహకులతో ఎరుకుల రామకృష్ణ, సుజాత రమేష్‌బాబు తదితరులు

ప్యారీస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమాజం మెప్పుపొందేలా సేవాకార్యక్రమాలు నిర్వహించాలని అంతర్జాతీయ వాసవి క్లబ్‌ల ప్రెసిడెంట్, సేవారత్న ఎరుకుల రామకృష్ణ సూచించారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వీ502ఏ 12వ క్యాబినెట్ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం రాత్రి అరుంబాక్కం వైష్ణవ కళాశాల ప్రాంగణంలోని ఆడిటోరియంలో జరిగింది. వాసవి మాతకు పూజలు, లలితా సహస్రనామ పారాయణం అనంతరం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు అలరించారు. అంతర్జాతీయ వాసవి క్లబ్‌ల ట్రెజరర్ సుజాత రమేష్‌బాబు క్లబ్ తరుపున ప్రపంచ వ్యాప్తంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. డిస్ట్రిక్ వీ502ఏ 12వ క్యాబినెట్‌కు నూతన గవర్నర్‌గా ఎంపికైన సీఎం.రాజేష్, కార్యదర్శి బండారం అనంత పద్మనాభన్, ఆర్‌వీఎల్ రత్నకుమార్‌లచే ముఖ్య అతిథి ఎరుకుల రామకృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025వ సంవత్సరంలో క్లబ్‌లు ఏఏ అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలో దిశా నిర్దేశం చేశారు. మద్రాస్ ప్రెసిడెన్సీగా ఉన్న రోజుల్లో 1932లో ఆర్యవైశ్య పితామహుడు ముక్కా వెంకట సుబ్బారావు, మిత్రుల బృందం సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సేవలందించాలన్న సంకల్పంతో ఆర్యవైశ్య సంఘాన్ని స్థాపించారని గుర్తు చేశారు. ఫెలోషిప్, లీడర్ షిప్, సర్వీస్ అనే లక్ష్యంతో స్థాపించిన వాసవి క్లబ్ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మహావృక్షంగా విస్తరించిందన్నారు. మానవత్వం రెట్టింపు కావాలన్న దృఢ సంకల్పంతో రూపొందించిన సరస్వతి పథకం ద్వారా ప్రతి క్లబ్ తమ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులను దత్తత తీసుకుని బాగా చదదివించాలని సూచించారు. కమ్యూనిటీ ప్రోగ్రామ్ కింద నిరుద్యోగ యువతను గుర్తించి వారికి స్కిల్ డెవెలెప్మెంట్ శిక్షణకు రూ.కోటి కేటాయించామని, క్లబ్‌లు ఈ పథకాలను సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. అలాగే దివ్యాంగులు, అభాగ్యులను ఆదుకోవాలని, అంకిత భావంతో అన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించే క్లబ్‌లకు తగిన గుర్తింపు ఉంటుదని రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. క్లబ్‌ల ప్రముఖులు డా.ఎంవీ నారాయణ గుప్తా, నామా సతీష్‌కుమార్, ఏసీ మణికంఠన్, డా.వీఎస్ సెంథిల్‌కుమార్, లక్ష్మీ ఓలేటి, ఎస్వీ పద్మనాభన్, కేకే త్రినాధ్‌కుమార్, అనితా రమేష్‌బాబు, కుమరవేలు, రంజిత్ కుమార్, టి.జగదీష్‌బాబు తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.



సోమవారం చెన్నై సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి చేతుల మీదుగా పాఠశాల విద్యాశాఖలో ఉద్యోగ నియామక పత్రాలు అందుకుంటున్న క్రీడాకారులు

అయపాక్కంలో పొంగల్ వేడుకలు

● 25 రకాల బియ్యంతో పొంగళ్లు పెట్టిన మహిళలు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అయపాక్కంలో కోలాహలంగా జరిగిన పొంగల్ వేడుకల్లో, మహిళలు 25 రకాల బియ్యంతో పొంగళ్లు పెట్టారు. స్థానిక మధురవాయల్ సమీపం అయపాక్కంలో 'వ్యవసాయాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో నిర్వహించిన పొంగల్ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 30 నిమిషాల్లో 60 భారీ రంగవల్లికలను మహిళలు రూపొందించారు. అనంతరం 25 రకాల బియ్యంతో మహిళలు పొంగళ్లు పెట్టారు. ఈ కార్యక్రమాలను రికార్డు పుస్తకంలో నమోదుకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐసిఎఫ్‌లో ఏసీ సబర్బన్ రైళ్లు



పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసిఎఫ్‌లో ఏసీ సబర్బన్ రైళ్ల తయారీ ప్రారంభమైంది. ఈ విషయమై ఐసిఎఫ్ అధికారులు మాట్లాడుతూ... రైల్వే శాఖ అనుమతితో 2018 నుంచి ఏసీ సబర్బన్ రైళ్లను తయారు చేస్తున్నామన్నారు. ఐసిఎఫ్‌లో తయారైన తొలి రైలు ప్రస్తుతం ముంబైలో నడుపుతున్నారని తెలిపారు. తాజాగా, దక్షిణ రైల్వేకు రెండు ఏసీ సబర్బన్ రైళ్ల తయారీ ప్రారంభించామన్నారు. 12 బోగీలతో కూడిన ఈ రైళ్లు 110 కి.మీ వేగంతో వెళ్లే సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. అలాగే, ఆటోమేటిక్ తలుపులు, జీపీఎస్, డిజిటల్ బోర్డుపై తదుపరి వచ్చే స్టేషన్ పేర్లతో పాటు అన్ని బోగీల్లో సీసీ కెమెరాలుంటాయని తెలిపారు. చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య నడుపనున్న ఈ రైళ్లలో తొలి రైలు మరో రెండు నెలలు, రెండవ రైలు ఏప్రిల్‌లో ఆ శాఖ అధికారులకు అప్పగించనున్నామని వారు పేర్కొన్నారు.

రూ.1.26 కోట్లతో ఫాగింగ్ యంత్రాలు

● ప్రారంభించిన మేయర్ ప్రియ



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న మేయర్ ప్రియ, కమిషనర్ కుమరగురుపరన్ తదితరులు

ఐసిఎఫ్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాల్లో దోమల వ్యాప్తి నిర్మూలనకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పలు చర్యలు చేపట్టింది. ఇందుకోసం రూ.126 కోట్లతో కొనుగోలు చేసిన 30 ఫాగింగ్ యంత్రాలు, కాలువల్లో మందు చల్లే రూ.80 లక్షలతో కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలతో కూడిన 15 వాహనాలను సోమవారం రిప్పన్ భవనం ప్రాంగణంలో మేయర్ ప్రియ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమరగురుపరన్, అదనపు కమిషనర్ (ఆరోగ్యం) డా.వి.జయచంద్ర భాను, కార్పొరేషన్ అధికారపక్ష నేత ఎస్.రామలింగం, స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు (ప్రజా ఆరోగ్యం) డా.కె.శాంతకుమారి, కార్పొరేషన్ ఆరోగ్యశాఖ అధికారి డా.ఎం.జగదీశన్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షిస్తున్న 'అద్దాల వంతెన'



అద్దాల వంతెనపై పర్యాటకులు

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో సముద్రంపై ఏర్పాటుచేసిన అద్దాల వంతెన పర్యాటకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. వంతెనపై నడిచి వెళ్తూ అద్దాల నుంచి కింద కనిపిస్తున్న సముద్రాన్ని వీక్షిస్తూ పర్యాటకులు ఆశ్చర్యపోతున్నారు. కన్నియాకుమారి సముద్రం మధ్యలో వివేకానంద రాక్-తిరువళ్లువర్ విగ్రహాన్ని అనుసంధానం చేస్తూ రూ.37 కోట్లతో నిర్మించిన అద్దాల వంతెనను గత నెల 30వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. మరుసటిరోజు నుంచి ఈ వంతెనపై పర్యాటకులను అనుమతించనున్నారని భావించినా, అవలేదు. అదే సమయంలో, సముద్రపు వాతావరణం అల్లకల్లోలంగా ఉండడంతో ఈ నెల 4 నుంచి వివేకానంద రాక్ పడవ సవారీ నిలిపివేశారు. మరుసటి రోజు వాతావరణం అనుకూలించడంతో మధ్యాహ్నం 12.30గంటలనుంచి పడవ సవారీ పునరుద్ధరించారు. పడవలో వివేకానంద రాక్‌కు వెళ్లిన పర్యాటకులు,అక్కడి నుంచి అద్దాల వంతెన మీదుగా తిరువళ్లువర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. పర్యాటకుల సెల్ఫీలు, పిల్లలు కేరింతలతో అద్దాల వంతెనపై సందడి కనిపించింది. తొలిరోజు 13,500 మంది అద్దాల వంతెనపై వెళ్లారని జిల్లా కలెక్టర్ అళగుమీనా తెలిపారు.

'సింగార చెన్నై' పేరుతో ట్రావెల్ కార్డు

ఆవిష్కరించిన రవాణా మంత్రి శివశంకర్ ● సిటీబస్సులు, మెట్రోరైళ్లకు ఒకే కార్డు



అడయార్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిటీ బస్సులతో పాటు మెట్రో రైళ్ళలో ప్రయాణం చేసేలా 'సింగార చెన్నై' పేరుతో ట్రావెల్ కార్డును రాష్ట్ర రవాణా శాఖామంత్రి శివ శంకర్ సోమవారం ఆవిష్కరించారు. ఎంటీసీ సెంట్రల్ డిపోలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈ కార్డును ఆయన వినియోగంలోకి తెచ్చారు. నగర రవాణా సంస్థ, భారతీయ స్టేట్ బ్యాంకు సంయుక్తంగా ఈ కార్డు విడుదల చేశాయి. ఈ కార్డుపై మెట్రో రైళ్ళలో కూడా ప్రయాణించే సౌలభ్యాన్ని కల్పించారు. నగదు రహిత ప్రయాణ సేవలను నగర వాసులకు అందించే చర్యల్లో భాగంగా దూరదృష్టితో ప్రభుత్వం ఈ తరహా చర్యలను తీసుకుంటుంది. ఈ కార్డుతో ఎంటీసీ బస్సులు, మెట్రో రైళ్ళు ఇతర రవాణా సౌకర్యాలకు ఉపయోగించుకునేలా రూపొందించారు. రాష్ట్ర రవాణా శాఖను డిజిటలైజేషన్ కోసం ప్రభుత్వం చేపట్టిన చిన్న చర్యగా పేర్కొంటున్నారు. చెన్నై నగరంలో తిరిగే అన్ని బస్సుల్లో ప్రయాణించేందుకు సింగార చెన్నై పేరుతో ఓ కార్డు చలామణిలో ఉంది. ఈ పథకంలో భాగంగా ఎస్‌బీఐ తొలి దశలో 50 వేల కార్డులను ఉచితంగా పంపిణీ చేసింది. ఈ కార్డులు నగరంలోని కోయంబేడు, బ్రాడ్వే, సెంట్రల్ స్టేషన్, తాంబరం, పూందమల్లి, తిరువాన్మియూరు, రెడ్‌హిల్స్, వేళచ్చేరి, గిండి, ఆవడి, టి.నగర్, అంబత్తూరు, అంబత్తూరు ఓటీ, అయ్యన్ తాంగల్, కిలాంబాక్కం, వడపళని, శ్రీపెరంబుదూరు, పెరంబూరు, సైదాపేటలలో అందుబాటులో ఉన్నాయి. ఈ కార్డులను రీచార్జ్ చేసుకుంటూ ఉపయోగించుకోవచ్చు. ఆన్‌లైన్ లేదా మొబైల్స్, ఎంటీసీకి టిక్కెట్ విక్రయ కేంద్రాల్లో ఈ కార్డులను చేసుకునే అవకాశం ఉంది. అలాగే, ఆయా బస్సుల్లో కండక్టర్ దగ్గర కూడా రీచార్జ్ చేసుకోవచ్చు. అలా మల్టీపర్పస్‌గా ఉపయోగపడే ఈ కార్డులను ఇపుడు మెట్రో రైళ్ళలో కూడా ప్రయాణించేలా వెసులుబాటు కల్పించారు. ఈ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి శివశంకర్‌తో పాటు రవాణా శాఖ ఎండీ ఆల్ఫిజాన్ వర్గీస్, జేఎండీ నటరాజన్, ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఎండీ ఆర్.మోహన్, ఎంటీసీ, భారత స్టేట్ బ్యాంకు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం



పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మానామధురై ప్రాంతంలో వికసించిన బ్రహ్మ కమలాన్ని ప్రజలు వచ్చి తిలకిస్తున్నారు. శివగంగ జిల్లా మానామధురై వెల్లయన్‌తోపు ప్రాంతానికి చెందిన నాగు పలురకాల పూల మొక్కలు పెంచుతున్నాడు. వాటిలో అరుదైన బ్రహ్మ కమలం కూడా ఉంది. ఈ మొక్కకు తొలిసారిగా ఆదివారం రాత్రి పుష్పం వికసించింది. నాగు కుటుంబ సభ్యులు మొక్కకు పూజలు, దీపారాధనలు నిర్వహించారు. ఈ సమాచారం తెలుసుకున్న చుట్టుపక్కల వారు వెళ్లి బ్రహ్మకమలానికి హారతులిచ్చి పూజలు చేశారు.

రెడ్‌మీ 14సీ 5జీ స్మార్ట్ ఫోన్ ఆవిష్కరణ



కొత్త స్మార్ట్ ఫోన్ ఆవిష్కరిస్తున్న షవామీ ఇండియా ప్రతినిధులు

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): షవామీ ఇండియా నగరంలో సరికొత్త రెడ్‌మీ 14సి5జీ స్మార్ట్‌ఫోన్ సోమవారం మధ్యాహ్నం ఆవిష్కరించింది. సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనుజ్ శర్మ, మార్కెటింగ్ అసోసియేట్ డైరెక్టర్ సందీప్‌శర్మ ఈ కొత్త మాడల్ ఫోన్ ఆవిష్కరించారు. ఈ కొత్త స్మార్ట్‌ఫోన్ రూ.9999ల ధరతో బ్లూ, పర్పుల్, బ్లాక్ రంగుల్లో ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుండి అమెజాన్ ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయానికి వస్తుందని వివరించారు. ఈ ఫోన్ 12 జీబీ రామ్, 128 జీబీ స్టోరేజీ , 50ఎంపీ ఏఐ డ్యూయెల్ కెమెరా, 5160 ఎంఏహెచ్ బ్యాటరీ తదితర సదుపాయాలతో కస్టమర్లను ఆకటుకోనుందని తెలిపారు.



కొడైకెనాల్ పర్వత శ్రేణులను కమ్ముకున్న మేఘాలు

కొడైకెనాల్‌ను కమ్మేసిన మేఘాలు

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్ కొండ ప్రాంతాల కింద మేఘాలు కమ్ముకున్న దృశ్యాలను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. కొండల యువరాణిగా పిలువబడే కొడైకెనాల్‌లో ప్రస్తుతం 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పార్క్‌ల్లోని చెట్లపై మంచు బిందువులు వర్షం కురుస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం మేఘాలు కిందకు దిగి పర్వతాలకు ముద్దాడుతున్న దృశ్యం పర్యాటకులను ఆహ్లాదపరిచింది. సాయంత్రం వేళలో సముద్ర కెరటాల్లా పర్వత శిఖరాల మధ్య మేఘాలు కమ్ముకున్నాయి. ఈ అపురూప దృశ్యాలను పర్యాటకులు తమ సెల్‌ఫోన్‌లో బంధించడం, పర్వతంపై నుంచి సెల్ఫీ తీసుకోవడంలో పర్యాటకులు నిమగ్నమాయ్యరు.

అన్నా వర్సిటీ ఉదంతంపై బీజేపీ ఎమ్మెల్యేల వాకౌట్



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యేలు

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్నావర్సిటీలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసును సీబీఐకి అప్పగించకుండా నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్న డీఎంకే ప్రభుత్వ వైఖరికి నిరసనగా శాసనసభ నుండి బీజేపీ సభ్యులు వాకౌట్ చేశారు. మొదట ఇదేవిషయమై 'ఎవరా సార్' అనే నినాదాలున్న ప్లకార్డులను ప్రదర్శించిన అన్నాడీఎంకే సభ్యులంతా గెంటివేతకు గురయ్యారు. ఆ తర్వాత బీజేపీ సభాపక్షనాయకుడు నయినార్ నాగేంద్రన్ నాయకత్వంలో ఇదే అంశంపై సభ నుంచి వాకౌట్ చేశారు. అసెంబ్లీ వెలుపల నాగేంద్రన్ మాట్లాడుతూ అన్నావర్సిటీలో విద్యార్థినిపై అత్యాచారం జరిపిన వ్యక్తి డీఎంకేకు చెందిన వాడని, అతడిపై పలు అత్యాచారం కేసులు కూడా ఉన్నాయని తెలిపారు. అందువలనే కేసు దర్యాప్తును నీరుగార్చేలా డీఎంకే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ తమ పార్టీ శాసనసభ్యులంతా వాకౌట్ చేసినట్లు తెలిపారు.



గెలుపే లక్ష్యంగా..

తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వేదికగా 13వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. కళాశాల క్రీడా మైదానంలో జరిగిన తొలిరోజు పోటీల్లో పలు కళాశాలల విద్యార్థులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్ పురుషుల విభాగంలో ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాలపై తిరుపతి కళాశాల జట్టు.. గరివిడిపై ఎన్టీఆర్ గన్నవరం కళాశాల జట్టు విజయం సాధించాయి. మహిళా విభాగంలో గరివిడి వెటర్నరీజట్టుపై తిరుపతి కళాశాల విజయం సాధించింది. బాస్కెట్‌బాల్ మహిళల విభాగంలో గన్నవరంపై ప్రొద్దుటూరు కళాశాల, తిరుపతి డెయిరీ టెక్నాలజీ కాలేజీపై స్థానిక వెటర్నరీ కళాశాల జట్టు విజేతగా నిలిచాయి. టెన్నికాయిట్‌లో తిరుపతి డెయిరీ టెక్నాలజీ కాలేజీపై ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాల.. గరివిడి వెటర్నరీ, తిరుపతి డెయిరీ టెక్నాలజీ జట్లపై తిరుపతి వెటర్నరీ కాలేజీ విజేతగా నిలిచింది. బాల్‌బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో ఎన్టీఆర్ వెటర్నరీపై గరివిడి వెటర్నరీ కళాశాల జట్టు గెలుపొందింది.



\- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.98 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 66,561

తలనీలాలు సమర్పించినవారు:18,647



ఒత్తిడిని చిత్తు చేద్దాం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమస్యలు..వీటి నుంచి ఉత్పన్నమయ్యే ఒత్తిళ్లు.. ఈ రెండూ అందరికీ నిత్య జీవితంలో ఎదురవుతాయి. అందుకే ఒత్తిళ్లను అమ్మ పొత్తిళ్ల అనుకోవాలంటారు పెద్దలు.. బుర్ర నిండా బోలెడు సమస్యలు. తెల్లారిలేచింది రాత్రి పక్క చేరేదాకా ఒకటే ఒత్తిడి. కూల్‌గా ఉండలేని పరిస్థితి. పరుగులెత్తే ఆధునిక ప్రపంచంలో నిశ్చింతగా ఉండటం అంత ఈజీ కాదు. ఒక్కొక్కరిదీ ఒక్కో లక్ష్యం. చేరుకోలేక నిత్యం సతమతం. వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఆర్థిక సమస్యలతో నిరంతరం కుస్తీ. పర్యవసానంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఇది మనసునే కాదు ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తోంది. కుంగదీస్తోంది. సమస్యను సరిగా అర్థం చేసుకోలేకపోవడం, పరిష్కారాన్ని కనుక్కోలేకపోవడం వల్ల ఒత్తిడి మరింతగా పెరుగుతుందంటారు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ గాయత్రి.. ఏ సమస్యా శాశ్వతంగా స్థిర నివాసమేర్పరుచుకోదని గుర్తిస్తే ఒత్తిడి పటాపంచలవుతుందంటున్నారు..ఆమె ఇంకా ఏం చెబుతున్నారంటే..



డాక్టర్ గాయత్రి అధ్యాపకురాలు, సైకాలజీ విభాగం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం



ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

సాధ్యమైనంతవరకూ ప్రతికూల మనస్తత్వాన్ని దూరం చేసుకోవాలి. సానుకూల దృక్పథాన్ని అలవరుచుకుంటే ఒత్తిడికి నేరుగా చెక్ పెట్టవచ్చు. అయిన దానికీ కాని దానికీ బూతద్దంలో చూడటం మానుకోవాలి. ఏమాత్రం తీరిక దొరికినా ఆత్మీయులతో కొన్ని షేర్ చేసుకోవాలి. కొంత భారం దిగుతుంది. మానసిక ఉల్లాసాన్ని పెంచే అభిరుచులను అలవర్చుకోవాలి. సృజనాత్మకతగా ఆలోచించినా ఉపశమనం కలుగుతుంది. పండ్లు, కూరగాయలు ఆహారంగా తీసుకోవడం ఉత్తమం. క్రమం తప్పకుండా వేళకు తిని పడుకోవాలి. రోజూ వ్యాయామం, ధ్యానం, యోగా చేయడం శ్రేయస్కరం. లేకపోతే ఒత్తిడి, రోగాలు మన కోసం సమయం కేటాయిస్తాయని గుర్తించాలి. ప్రకృతితో మమేకం కావడం. మంచి పుస్తకాలు చదవడం లాంటివి అభిరుచిగా మారితే ఒత్తిడికి గట్టిగా సమాధానం చెప్పవచ్చు. హాస్య వినోదాన్ని ఆస్వాదించాలి. మొహమాటంతో అన్నింటికీ ఎస్ అన వద్దు. చేయలేని పనులకు నో చెప్పండి. సమస్య గురించి ఎక్కువగా ఆలోచించి బుర్ర పాడుచేసుకోవడం కంటే అందులో సగం సమయం పరిష్కారం గురించి ఆలోచిస్తే ఎంతో ప్రయోజనం. మొబైల్ ఫోన్లకు అతిగా సమయం కేటాయిస్తే నిద్రకు దూరమై మానసిక,శారీరక అనారోగ్యం బారినపడతారు. మానసిక ఒత్తిడి తగ్గితే శ్వాస ప్రక్రియ కూడా సాధారణ స్థితికి చేరుకుంటుంది. అంతేకాదు హార్మోన్లూ సమతుల్యమవుతాయి. ఇక భావోద్వేగాలు మీ అదుపులో ఉంటాయి.

ఒత్తిడిని గుర్తించడం ఇలా..

తీవ్ర ఒత్తిళ్లకు లోనైపుడు కోపం, అసహనం, ప్రతీకారం,అభద్రత, నిరాశ, మనసులో గూడు కట్టుకుంటాయి. అపనమ్మకం పెరిగి ప్రతిదానికీ భయపడుతుంటారు. ఫలితంగా నిద్ర లేమి ఉత్పన్నమవుతుంది. దీంతో నీరసించిపోవడంతోపాటు భావోద్వేగాల నియంత్రణలో మార్పులు కనిపిస్తాయి. ఇవి బీపీ, షుగర్ వంటి సమస్యలకు కారణమవుతాయి. గుండెజబ్బులకూ దారితీస్తాయి. ఒత్తిడి దీర్ఘకాలంగా ఉంటే మతిమరుపు, డిప్రెషన్, అజీర్తి, అస్తమా, గుండెజబ్బులు రావచ్చు.

విద్యుత్ శాఖ ప్రతిపాదనలపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(ఆటోనగర్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, విద్యుత్ రిటైల్ ధరలపై ఏఆర్ఆర్, సప్లయ్ టారిఫ్ ప్రతిపాదనలపై మంగళ, బుధ, శుక్రవారాల్లో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభమవుతుందని తిరుపతి జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్ర నాయుడు తెలిపారు. ఎస్ఈ కార్యాలయంలో తిరుపతి టౌన్, తిరుపతి రూరల్ డివిజన్ల ప్రజలు పాల్గొంటారని పేర్కొన్నారు. పుత్తూరు, నాయుడుపేట, గూడూరు డివిజన్ కేంద్రాల్లో వినియోగదారులు పాల్గొని అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలపాలని కోరారు. పాల్గొనదలచిన వారు మంగళ, బుధవారాల్లో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. అయితే నియంత్రణా మండలి చైర్మన్ అనుమతితో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, సోమవారం ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించిన మాక్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈలు వాసురెడ్డి, చంద్రశేఖరరావు, వాసవీలత పాల్గొన్నారు.

నేడు యూజీసీ కమిటీ రాక

ఎస్వీయూ దూరవిద్య నిర్వహణపై మూడు రోజుల పాటు అధ్యయనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచీ ఎస్వీయూలో యూజీసీ కమిటీ పర్యటించనుంది. వర్సిటీ దూరవిద్య విభాగ నిర్వహణపై మూడు రోజుల పాటు ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. నలుగురితో కూడిన ఈ కమిటీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు సెనేట్ హాల్లో అధికారులు, అధ్యాపకులతో కమిటీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. అనంతరం దూరవిద్య కోర్సులు గల సబ్జెక్టులు గల విభాగాలను కమిటీ పరిశీలించనుంది. విద్యార్థులతోనూ కమిటీ ముచ్చటించనుంది.

దామినేడులో దొంగల హల్‌చల్

● ఇంటి తలుపులు పగులగొట్టిన వైనం

తిరుచానూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా దామినేడులో మరో చోరీ జరిగింది. బాధితుని కథనం మేరకు కథనం దామినేడులో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. వ్యాపారరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లొస్తుంటారు. రెండు రోజుల క్రితం వెంకటేశ్వరరావు ఇంటిలో ఆయన సోదరి కుటుంబ సభ్యులు బస చేసి వెళ్లారు. సోమవారం ఉదయం పనిమనిషి ఇంటిని శుభ్రం చేయడానికి రాగా, ప్రధాన తలుపు తెరచి ఉంది. అనుమానించి ఇంటి యజమాని వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసింది. ఆయన సూచనతో ఆమె తిరుచానూరు పోలీసులకు విషయం తెలియసేసింది. దుండగులు ఆదివారం రాత్రి ప్రధాన గేటు తాళాలు విరగొట్టారు. ప్రధాన ద్వారం ఆటోమేటిక్ లాక్ రాకపోవడంతో తలుపు విరగొట్టి లోపలకు వెళ్లారు. సీసీ కెమెరాను పగులగొట్టారు. వెంకటేశ్వరరావు సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరారు. ఆయన వచ్చి చూస్తే చోరీ సొత్తు వివరాలు తెలుస్తాయి.



చిందరవందరగా వస్తువులు

రెవెన్యూ సదస్సులకు 186 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నిర్వహించిన 31 రెవెన్యూ సదస్సులకు 186అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 16,097 అర్జీలు రాగా అందులో 709 పరిష్కరించామన్నారు. మిగిలిన వాటిని నిర్దిష్ట కాలపరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారన్నారు.

రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు

● ఛిద్రమౌతున్న కొండగుట్ట





గ్రావెల్ తవ్వకాల వద్ద ఆరిమేనిపాడు గ్రామస్తుల నిరసన - గ్రావెల్ తవ్వకంతో ఏర్పడిన భారీ గోతులు

ఓజిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో ఆరిమేనిపాడు నుంచి రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు యథేచ్ఛగా సాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన ముప్పాళ్ళ నరేష్‌రాజు, గుంటమడుగు రవీంద్రరాజు, మస్తాన్‌రాజు కట్టిబోయిన వెంకటేశ్వర్లు, మల్లికార్జున్‌రాజు, పట్టాభిరాజు, ఈశ్వరరాజు తదితరులు గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతుల వద్ద నిలబడి నిరసన తెలిపారు. వారి కథనం మేరకు వివరాలు... ఆరిమేనిపాడు సర్వే నెంబరు 65లో 260.72 ఎకరాలు కొండగుట్టగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఇక్కడ నుంచి గ్రావెల్ తరలింపు కోసం 54 ఎకరాల లీజు కోసం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ సంస్థ 15 జూన్ 2020న దరఖాస్తు చేసుకుంది. పర్యావరణ ప్రజా విచారణ పేరుతో 2022 అక్టోబరు 28న ఆరిమేనిపాడు గ్రామంలో అధికారులు సమావేశం నిర్వహించారు. గ్రామస్తులందరూ క్వారీ అనుమతులకు అభ్యంతరం తెలిపారు. కొన్నాళ్ల తరువాత గ్రామస్తుల కంటపడకుండా రాత్రుళ్లలో గ్రావెల్ తరలింపు జరుగుతుండడంతో ఆరిమేనిపాడు వాసులంతా ఏకమై అడ్డుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక గత రెండు నెలలుగా క్వారీకి పూర్తి స్థాయి అనుమతులు ఉన్నాయంటూ గ్రావెల్ తరలింపునకు పూనుకున్నారు. గ్రామస్తులంతా ఏకమై అడ్డుకోవడంతో క్వారీ నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించి కేసులు పెట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అధికారులను సంప్రదించి క్వారీ అనుమతులకు సంబంధించిన వివరాలు సేకరించగా బోగస్ పత్రాలతో 2022లో క్వారీ నిర్వాహణకు అనుమతి పొందినట్లు తేలిందన్నారు. క్వారీ అనుమతులకు తమ అభ్యంతరం లేదని కాంద్ర (చిల్లకూరు మండలం), వెందోడు (బాలాయపల్లి మండలం)గ్రామాల వారితో పాటు ఆరిమేనిపాడుకు చెందిన కొంతమంది అర్జీ ఇచ్చినట్లుగా పేర్కొన్నారని, ఇందుకోసం తమ గ్రామస్తుల సంతకాలను ఫోర్జరీ చేశారని ఆరిమేనిపాడువాసులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గ్రామంలో లేని వ్యక్తుల పేర్లు కూడా ఉన్నాయని తెలిపారు. ఆ బోగస్ పత్రాలతో ఇచ్చిన అనుమతి కూడా 2024సెప్టెంబరుతో ముగిసిందన్నారు. పక్క మండలాల్లోని గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, అక్కడి స్థానికులు సమ్మతించినట్లు చూపే పత్రాలతో తమ గ్రామంలో క్వారీ నిర్వహణకు ఎలా అనుమతి ఇస్తారని ఆరిమేనిపాడువాసులు ప్రశ్నిస్తున్నారు. పైగా గతేడాది సెప్టెంబరుతో ముగిసిన అనుమతి పత్రాలతో రాత్రి వేళ గ్రావెల్ తరలించడం అక్రమమేనని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో ముగ్గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్ల తొలగింపు

● మరొకరిపై విచారణ

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సెక్యూరిటీ విభాగంలో కొందరి తీరు అభ్యంతరకరంగా మారింది. కొంతకాలంగా విధి నిర్వహణలో వారు వ్యవహరిస్తున్న శైలిపై అధికారులు పలుమార్లు మందలించినా పద్ధతి మార్చుకోలేదు. ఫలితం.. ఒకేసారి ముగ్గురు సూపర్‌వైజర్లను విధుల నుంచి తప్పించారు. మరొకరిపై మహిళల ఫిర్యాదుతో అధికారులు గోప్యంగా విచారణ చేపట్టారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరుకు చెందిన శీనయ్య అనే సూపర్‌వైజరు మహిళా సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, ఇష్టంవచ్చినట్లు గార్డులను నియమించుకోవడం.. ఇష్టం లేని వారికి విధులు కేటాయించకుండా వేధించడంలాంటి చేసేవాడన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మూడు నెలల క్రితం ఆయన్ను కొంతకాలం విధుల నుంచి పక్కన పెట్టారు. మళ్లీ అధికారులను ప్రాధేయపడటంతో తిరిగి సూపర్‌వైజర్‌గా అవకాశం ఇచ్చారు. ఇక, శ్రీకాళహస్తి పట్టణానికి చెప్పిందిన శ్యామ్ ఆలయ రెండో గోపురం పక్కనే యూనిఫాంలో మద్యం తాగుతున్న ఫొటోలు, వీడియోలు రెండు నెలల క్రితం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అధికారులు మందలించి క్రమశిక్షణతో పనిచేయాలని కొనసాగించారు. ఇటీవల సూపర్‌వైజర్లు ఒక ప్రామాణికం లేకుండా సెక్యూరిటీ గార్డులను నియమించుకోవడం, కొందరికి విధులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసేవారు. ఆలయంలో భక్తుల నుంచి నగదు వసూలయ్యే కీలక స్థానాల్లో అనుకూలమైన వారిని నియమించుకోవడం ద్వారా ఆ నగదు వాటాలుగా పంచుకుంటున్నట్లు ఈవో బాపిరెడ్డికి ఫిర్యాదులు వచ్చాయి. దాంతో నాలుగు రోజుల పాటు విధులు కేటాయింపుపై ఈవో దృష్టి సారించారు. ప్రత్యేకంగా ఆదాయం వచ్చే చోట్ల కొందరు సూపర్‌వైజర్లకు విధులు కేటాయించి నిఘా పెట్టారు. వీరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సీసీకెమెరాల ద్వారా పక్కా ఆధారాలతో గుర్తించారు. దీంతో ఎప్పటి నుంచో విమర్శలున్న శీనయ్య, శ్యామ్‌తో పాటు చంద్రను విధుల నుంచి తప్పుకోవాల్సిందిగా ఆదేశించారు.

విధులివ్వకుండా వేధిస్తున్నారని..

శ్రీకాళహస్తి పట్టణం వాటర్‌హౌస్ కాలనీకి చెందిన సూపర్‌వైజర్ షణ్ముగంపై సోమవారం కొందరు మహిళా సెక్యూరిటీ గార్డులు ఫిర్యాదులు చేశారు. తొట్టంబేడు మండలం కన్నలి నుంచి ఓ మహిళ గార్డు విధుల కోసం మధ్యాహ్నం ఆలయం వద్దకు వచ్చారు. ఈమెకు కాకుండా, సీనియార్టీ ప్రకారం వెనుక ఉన్న మహిళకు షణ్ముగం డ్యూటీ కేటాయించారు. ఇలా నాలుగు రోజుల నుంచి డ్యూటీ ఇవ్వకుండా తిప్పి పంపుతున్నట్లు ఆమె నేరుగా ఓ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై రిజిస్టర్‌లో అధికారులు పరిశీలించి షణ్ముగంను మందలించారు. రెండు నెలల క్రితం సూపర్‌వైజరు షణ్ముగం ఓ మహిళా సెక్యూరిటీ గార్డును విధుల్లో ఉండగా అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వచ్చింది. కొద్దిరోజుల పాటు అతడిని విధుల నుంచి తొలగించినప్పటికీ.. మళ్లీ చేరాడు. కాగా, విధుల్లో ఉండగా వీడియోలు తీస్తూ వేధిస్తున్నారని కొందరు మహిళా సెక్యూరిటీ గార్డులు సోమవారం మళ్లీ ఫిర్యాదు చేశారు. దీంతో షణ్ముగం వ్యవహారంపై విచారించి చర్యలు తీసుకుంటామని ఈవో వెల్లడించారు.

తిరుమలలో నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, జనవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలు జరగనున్న క్రమంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) చేపట్టనున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధిని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆనందనిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయంలోపల ఉన్న ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను శుభ్రంగా కడుగుతారు. తర్వాత సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.



సురేఖవాణి, సుప్రిత

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీనటి సురేఖవాణి, ఆమె కుమార్తె సుప్రిత, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ ఉన్నారు.

పోలీసు పీజీఆర్‌ఎస్‌కు 69 వినతులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 69 వినతులు వచ్చాయి. ఎస్పీ సుబ్బరాయుడు అర్జీదారుల సమస్యలు తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని పరిశీలించి, ఆయా స్టేషన్లకు పంపారు. నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణం పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

సమస్యలను పట్టించుకోండి మహాప్రభో..!



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు

కలెక్టరేట్‌కు క్యూకట్టిన అర్జీదారులు - పీజీఆర్‌ఎస్‌కు 214 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్),జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'మా సమస్యలను పరిష్కరించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అర్జీదారులు పెద్దయెత్తున హాజరై కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులకు తమ సమస్యలను విన్నవించారు. మొత్తం 214 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 148 ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గెరికినెట్టు గ్రామస్తులు

గ్రామానికి దారి చూపండి

తమ గ్రామానికి దారి చూపాలని పాకాల మండలం గెరికినెట్టు వాసులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. దారి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. గానుగపెంట-మొగరాల రోడ్డు నుంచి తమ గ్రామానికి వచ్చే దారిని కొంతమంది అక్రమంగా మూసేశారని తెలిపారు. ఆ దారిలో నడవకూడదని దౌర్జన్యం చేస్తున్నట్లు చెప్పారు. రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్నామని, ఎవరైనా చనిపోతే శవాన్ని తీసుకెళ్లాలన్నా దారి లేదని వాపోయారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగరాజమ్మ డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ గౌరవాధ్యక్షుడు శివకుమార్, సుశీల, నాగమణి, సుబ్రహ్మణ్యం, మంగమ్మ పాల్గొన్నారు.

పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి

అయ్యా..నేను పుట్టుకతో దివ్యాంగురాలిని. 2014లో ఎన్టీఆర్ భరోసా పింఛను వచ్చేది. జగన్ ప్రభుత్వం రాగానే రద్దు చేశారు. ఐదేళ్లుగా పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఒక్క అధికారి కూడా సమాధానం చెప్పడం లేదు. మీరైనా స్పందించి పింఛన్ ఇచ్చేటట్టు చూడండి.

\- సులోచనమ్మ, గోవర్ధనపురం, వరదయ్యపాళెం మండలం



సదరం సర్టిఫికెట్ ఉన్నా పింఛను ఇవ్వడంలేదు

అయ్యా.. అనారోగ్యం కారణంగా కుడికాలు పూర్తిగా తొలగించారు. జీవనోపాధిలేక ఇబ్బంది పడుతున్నా. సదరం సర్టిఫికెటు ఇచ్చినా కూడా అధికారులు పింఛను మంజూరు చేయడం లేదు. మీరైనా న్యాయం చేయండి.

\- విష్ణు, అడవి కొడియంబేడు, పిచ్చాటూరు మండలం

